క్లుప్తంగా

మాజీ సర్పంచ్ జుబేర్ మృతి


జుబేర్ (ఫైల్)

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు మాజీ సర్పంచ్ ఎస్ఏ జుబేర్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందారు. ఈయన 1986 నుంచి 1995 వరకు కల్లూరు మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా కొనసాగారు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

దరఖాస్తు చేసుకోండి

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సరళ అన్నారు. ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఆసక్తిగల విద్యార్థులు ఆనలైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయిస్తామని తెలిపారు. మే 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 7,8,9 తరగతుల్లో కూడా విద్యార్థులు చేరవచ్చని చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 9849387564, 9440135924 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం


మహిళలతో మాట్లాడుతున్న సావిత్రమ్మ

బైరెడ్డిపల్లి: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉంటారని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. బైరెడ్డిపల్లెలో గురువారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్తహీనత వలన చాలామంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విటమిన్‌లతో కూడిన ఆహార పదార్థాలు తినాలన్నారు. ఆరోగ్యసిబ్బంది లక్ష్మీ, ముబీనా, జయమ్మ, రాజేశ్వరి, భారతి పాల్గొన్నారు.

కోలాహలం.. బాటగంగమ్మ జాతర


పురవీధుల్లో ఊరేగుతున్న బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: మండలంలోని గొనితిమ్మేపల్లెలో బుధవారం రాత్రి బాటగంగమ్మ జాతర కోలాహలంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు టెంకాయలు కొట్టి, కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

చింతచెట్టుకు మంటలు

పుంగనూరు: మండలంలోని మంగళం గ్రామంలో గురువారం చింతచెట్టుకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డికి చెందిన చింతచెట్టుకు తొర్ర పడి అందులో చెత్త ఉంది. దానిపై గుర్తు తెలియని వ్యక్తులు తాగి పడేసిన సిగరెట్ వేయడంతో మంటలు చెలరేగాయని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

తెలుగు మాస్టర్‌కు కన్నీటి వీడ్కోలు


చంద్రశేఖర్(ఫైల్)

పుంగనూరు: ముప్పై సంవత్సరాలకు పైగా వేలాది మంది విద్యార్థులకు తెలుగు పాఠాలు నేర్పిన సురమాల చంద్రశేఖర్(74)కు పలువురు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి పుంగనూరులో ఆయన ఆనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే వందలాది మంది విద్యార్థులు, సన్నిహితులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగ సంఘ నేతలు చెంగారెడ్డి, మునస్వామి మొదలియార్, రామకృష్ణారెడ్డి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

14న మెగా వైద్యశిబిరం

పుంగనూరు: డాక్టర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ఈనెల 14న మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ వారి సహకారంతో అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని చింతలవీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి శిబిరం జరుగుతుందని తెలిపారు.

పరిధి పెంపు ఎప్పటికో?

- పలమనేరు మున్సిపల్ పరిధి పెంచిన మ్యాప్ సిద్ధం
- ముసాయిదా మాస్టర్‌ప్లాన్-2041పై ప్రకటన
- గత ప్రభుత్వంలోనే అభ్యంతరాలు, సూచనల స్వీకరణ


పలమనేరు పట్టణ వ్యూ

పలమనేరు వివరాలు
పట్టణ విస్తీర్ణం: 17.76 చ.కిలోమీటర్లు
2010 జనాభాలెక్కల మేరకు పట్టణ జనాభా 51,163
ప్రస్తుత పట్టణ జనాభా: 64వేలు
మున్సిపాలిటీలో వార్డులు: 26

పలమనేరు: అమృత్ పథకంలో పట్టణాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పలమనేరు పట్టణ పరిధిని పెంచి భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం సన్నాహాలు చేసింది. ఇందులోభాగంగా అప్పట్లోనే జీఐఎస్ ఆధారిత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను తయారు చేశారు. ప్రతిపాదిత భూ వినియోగ పటంపై 2023 అక్టోబర్ 18 దాకా సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పలమనేరు పురపాలక సంఘంలో స్వీకరించారు. అప్పట్లోనే ఇందుకు సంబంధించి పలమనేరు, కుప్పం, మదనపల్లి పట్టణాభివృద్ధి సంస్థ(పీకేఎంయూడీఏ) ఫామ్-1 నోటీసును జారీ చేసింది. పట్టణాభివృద్ధికి అవసరమైన అన్ని పారా మీటర్ల ఆధారంగా ముసాయిదా స్కెచ్‌ను రూపొందించారు. మళ్లీ దీని గురించి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయింది.

ప్రస్తుత మున్సిపల్ భూ వినియోగమిలా..

మొత్తం పట్టణ భూవినియోగం 4,670 హెక్టార్లుగా ఉంది. ఇందులో మేజర్‌గా 311 హెక్టార్లలో నివాసాలు, 27 హెక్టార్లలో వ్యాపార సముదాయాలు, 46 హెక్టార్లలో పరిశ్రమలు, మిగిలిన విస్తీర్ణంలో పంటపొలాలు, ఖాళీ స్థలాలు, ఇతరత్రా ఉన్నాయి. పట్టణానికి తూర్పున ఆంజనేయస్వామి ఆలయం, పడమర క్యాటిల్‌ఫామ్ వంతెన, ఉత్తరం గంగవరం మండల సరిహద్దు దక్షిణాన ఫైర్ కేంద్రంగా హద్దులున్నాయి.

గతంలో ప్రతిపాదించిన మ్యాప్..

ప్రతిపాదించిన మ్యాప్ మేరకు హద్దులు ఇలా ఉన్నాయి. తూర్పున గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు అడవి, పడమర మొరం పంచాయతీ రంగినాయునిపల్లి, నక్కపల్లి(పార్టు) ఉత్తరాన గంగవరం బైపాస్, దక్షిణాల పెంగరగుంట(పార్టు)గా రూపొందించారు. దీంతో పలమనేరు మండలంలోని టి.వడ్డూరు, బేరుపల్లి, మ్రిమాకులపల్లి, పెంగరగుంట, కోతిగుట్ట, జంగాలపల్లి సమీపంలోని కౌండిన్య నది వరకు, రామాపురం, రంగినాయనిపల్లి, సి.కురప్పల్లి గంగవరం మండలంలోని జీడిమాకులపల్లి పార్టు దాకా విస్తీర్ణం పెంచారు. ముసాయిదా పటంలో ప్రతిపాదిత మున్సిపల్, గ్రామ, రెవెన్యూ హద్దులను చూపారు. ఈ పరిధిలోని కొండలు, అడవులు, జాతీయ, రాష్ట్ర, ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులను అందులో గుర్తించారు. ఇంతటితో ఈ కార్యక్రమం ఆగింది. ఇక ఈ ప్రభుత్వంలోనైనా పలమనేరు మున్సిపల్ పరిధి పెరిగేనానని పట్టణవాసులు భావిస్తున్నారు. దీంతో స్థానిక మున్సిపాలిటీ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పట్టణంగా మారేందుకు అవకాశముంటుంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

పెద్దపంజాణి: పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ శారదాదేవి ఆదేశించారు. గురువారం కోగిలేరు పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మురుగునీటి కాలువలను తరచూ శుభ్రం చేయాలన్నారు. గ్రామస్తులు రహదారుల పక్కన పేడదిబ్బలు వేయరాదని, ఇప్పటికే దిబ్బలు ఉన్నట్లయితే సంబంధిత యజమానికి నోటీసులిచ్చి తొలగించేందుకు పీఏస్‌లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్దేశించిన ఫోన్ నంబర్ల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటారని, ఫోన్ కాల్ వచ్చినప్పుడు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. కార్యాలకమంలో సర్పంచ్ రమేష్‌బాబు, పీఏస్ సుజాత పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుతో ఇబ్బందులు


మాట్లాడుతున్న అయూబ్‌బాషా

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లుతో మసీదుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతాయని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్‌బాషా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తోందని, మతాలపై దాడులకు ఈ బిల్లు దోహదం చేస్తుందని, శాంతి భద్రతలను దెబ్బతిస్తుందని ఆరోపించారు. ముస్లింల విశ్వాసాన్ని దెబ్బతీసే వక్ఫ్ బిల్లుతో సమస్యలు తీవ్రమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు అల్తాఫ్, ముబారక్, ఫయాజ్, షనవాజ్, సాధిక్, సుహేల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రేసీమేరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి చెందిన పీడియాట్రిక్, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులు శిబిరంలో 250 మంది విద్యార్థులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సెక్రటరీ జేసుమేరీ, రవి, సిద్ధారెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పట్టణంలోని హనుమంతరాయుని సన్నిధిలోగల వీరాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవ పోస్టర్లను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలో ఆవిష్కరించారు. గురువారం ఆలయ నిర్వాహకులు తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం
- తాగునీటి సమస్య నివారణకు చర్యలు
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

కుప్పం: ఈ నెల 15వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అధికారులు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగుతోందని, దీన్ని అధికారులు దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన కోరారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై సమీక్షించారు. వీఆర్‌ఓలు, ఆర్ఐలు తమ పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కాలయాపన తగదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం చూపితే శాఖపరమైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. నరేగా కింద ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానం, ప్రహరీ గోడ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు ఈ ప్రతిపాదనలు పూర్తిచేయాలని సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు. నరేగా కింద మొదటి దశగా 60 పాఠశాలలు ఎంపిక చేశారన్నారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన 11 దేవాలయాల్లో 3 దేవాలయాలకు టెండర్లు కూడా పిలిచామన్నారు. మిగిలిన 8 దేవాలయాల అభివృద్ధి కోసం ఈనెల 15వ తేదీలోపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కడా పీడీ వికాస్‌మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి సబ్సిడీ రుణాలు


రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

గుడిపాల: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను ఇస్తోందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు సాయిసుధ, సాయితేజ కోరారు. గురువారం వసంతాపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నష్టపోతున్న రైతుల కోసం ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌల్ట్రీఫామ్, గొర్రెలు, పాడి ఆవులకు సంబంధించి సబ్సిడీ లోన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. భూమిలేని వారిని కూడా గుర్తించి వారికి ప్రభుత్వ భూమిని లీజుకు ఇస్తూ అందులో పౌల్ట్రీఫామ్‌ను ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పాడి ఆవులు ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీపై 50 శాతం రాయితీతో దాణా, ఫీడ్‌ను కూడా ఇస్తామన్నారు. వెటర్నరీ అసిస్టెంట్లు అబ్దుల్లా, రవి, గజపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

– వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ ఉమ

తవణంపల్లె: ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం వైపు మరలి ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులే లక్ష్యంగా ముందుకు పోవాలని వ్యవసాయశాఖ చిత్తూరు డివిజన్ ఏడీఏ ఉమ పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై బుధవారం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించి ఏడీఏ మాట్లాడారు. విష రసాయనాల వల్ల ఎన్నో వ్యాధులు ప్రబలుతున్నాయని.. పర్యావరణానికి ముప్పు సైతం వాటిల్లుతోందన్నారు. మానవాళి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ, 2025 ఖరీఫ్ వార్షిక ప్రణాళిక సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ నమూనాలైన ఏ గ్రేడ్, ఏటీఎం, సూర్యమండలం, పీఎండీఎస్,ఆర్‌డీఎస్, 5 లేయర్ మోడల్ విత్తశుద్ధి, విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పించాలన్నారు. కవిత, సరిత, నీలకంఠారెడ్డి ఖరీఫ్ వార్షిక ప్రణాళికపై అవగాహన కల్పించారు.అనంతరం వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, అభ్యుదయ రైతు వినోద్‌రెడ్డి మాట్లాడారు. ఆముదం పంట సాగు వల్ల మంచి దిగుబడి, ఆదాయం వస్తుందన్నారు. పెరటితోటలు, నవధాన్యాల విత్తన కిట్లు పంపిణీ చేశారు. ఏపీఎం రవి, రైతులు, వీఏఏలు, వీఎఏలు, వీఓఏబీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో విశేష కృషి

సిబ్బందికి సన్మానం


అధికారులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: మున్సిపల్ ఆస్తి, ఖాళీ పన్నుల వసూళ్లలో పలమనేరు మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో స్థానంలోనూ, రీజనల్ స్థాయిలో రెండో స్థానం, జిల్లాలో తొలి స్థానాన్ని సాధించింది. దీంతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం పన్ను వసూళ్లకు కృషి చేసిన ఆర్వో రవిరెడ్డి, ఆర్ఐ యోగరంజని, షరాబు కిరణ్‌కుమార్, బిల్ కలెక్టర్లను ఘనంగా సన్మానించారు. వచ్చే ఏడాదిలోనూ మరింత పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే టాప్‌లో ఉండాలని ఆయన తెలిపారు. మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, డీఈ సురేష్, ఏఈ స్నేహప్రియ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలపై అవగాహన


మాట్లాడుతున్న డీపీటీఓ జగదీష్

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపారాల కోసం లీజుకిచ్చేందుకు ఔత్సాహిక వ్యాపారులతో స్థానిక డిపో వద్ద గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డీపీటీఓ జగదీష్, డీఈఈ చెన్నకేశవులు, డీఎం టీకే స్వామి పాల్గొని ఇక్కడి ఖాళీ స్థలాల వివరాలు, వాటి అద్దెలను వివరించారు. ఆసక్తిగల వారు ఇక్కడ స్థలాలను లీజుకు పొందాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

పుంగనూరు: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన మునివెంకటప్ప కుమారుడు సుబ్రమణ్యం(30). ఇతను గురువారం సొంత పనుల నిమిత్తం పుంగనూరుకు బైకులో బయలుదేరాడు. మ్రిమాకులపల్లె సమీపంలో వెళుతుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుబ్రమణ్యంను స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రహీంఖాన్

పలమనేరు: పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రహీంఖాన్ ఎంపికయ్యారు. ఆమేరకు ఆపార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జ్ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలో నూతన అధ్యక్షుల నియామకాలు జరిగాయి. పలమనేరు పట్టణ అధ్యక్షుడిగా రహీంఖాన్, బైరెడ్డిపల్లి మండలానికి కొత్తిండ్లు రామప్ప, పలమనేరు రూరల్‌కు దొర్రై, పెద్దపంజాణికి శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు


మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం

తవణంపల్లె: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం ఆదేశించారు. గురువారం స్థానిక ఈజీఎస్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమీక్షించారు. మండలంలో జాబ్‌కార్డు ఉన్న వారితో నీటి కుంటల పనులు చేయించాలన్నారు. ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు రూ.307 వేతనాలు పెంచామని, కూలీలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పొలాల్లో అన్ని రకాల పండ్ల తోటలు పెంపకానికి అవకాశం ఉందన్నారు. ఈజీఎస్ సిబ్బంది గ్రామాలకు వెళ్లి, కూలీలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, ఈసీ రమ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విరివిగా ల్యాబ్ టెస్టులు చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డెంగీ, మలేరియా అనుమానిత కేసులు వస్తే విరివిగా ల్యాబ్ టెస్టులు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఎంఓ వేణుగోపాల్ ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం వారు ల్యాబ్ టెక్నీషియన్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అక్కడక్కడా మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ల్యాబ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత కేసులకు విధిగా పరీక్షలు చేయించాలన్నారు. 10శాతం ఓపీలో టీబీ పరీక్షలు చేయాలని ఆదేశించారు.

వడదెబ్బపై అప్రమత్తం

చిత్తూరు రూరల్(కాణిపాకం): వడదెబ్బపై ప్రజలను అప్రమత్తం చేసే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం అధికారులతో ఆమె సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంత రావు, డీఎంఓ వేణుగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్లు గిరి, ప్రవీణ, అనూష, రామ్మోహన్, ప్రసాద్, శ్రీవాణి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు

సదుం: మండలంలోని పాపిరెడ్డిగారిపల్లెలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యహవచనం, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర ఘట్టాభిషేకం, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, అమ్మవారి ఊరేగింపు ఆలయ ధర్మకర్త దామోదర ఆధ్వర్యంలో జరిగాయి. అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడులు చేసుకుంటే చర్యలు

పుంగనూరు: వ్యక్తిగత కక్షలు, భూ తగాదాలను అడ్డుపెట్టుకుని ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లోకేష్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని లక్కుంట గ్రామంలో బుధవారం భూ వివాదాలతో పరస్పర దాడులు చేసుకున్న ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే సంబంధించిన వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించామన్నారు. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీయిజాన్ని, దౌర్జన్యాలను సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో నూతనంగా నిర్మించిన తిరుపతి గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో పుణ్యాహవచనం, వాస్తుపూజ, గణపతి, నవగ్రహ, వాస్తు హోమాలు, యాగపూజ, సహస్ర నామార్చన, కలశ స్థాపన చేసి రాత్రి వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం యాగపూజ, ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకుల తెలిపారు.

రొంపిచెర్లలో వర్షం


వీధిలో నిలిచిన వర్షపు నీరు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గురువారం రాత్రి కూడా చిత్తూరు జిల్లాలో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, పిడుగులు కూడా పడతాయని తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. చాలా రోజుల తర్వాత మండలంలో వర్షం పడడంతో చల్లటి వాతావరణం ఏర్పడింది. ఇప్పుడు కురిసిన వర్షానికి వ్యవసాయ పంటలకు ఎలాంటి నష్టం లేదని రైతులు తెలిపారు. ఎక్కువ వర్షం పడితే మామిడి, టమాట పంట దెబ్బ తినే అవకాశం ఉందని తెలిపారు.